# కులమతాలకతీతంగా అభివృద్ధి చేశాం



మేరు కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

- ప్రతి ఇంటికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాం..
- మరోసారి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా..
- మేరు, పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనాల్లో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, అక్టోబర్ 13 : కులమతాలకతీతంగా నగరంలో సంక్షేమ పథకాలను అందించామని.. నగరాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేశామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మేరు కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. మేరు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశామని, ప్రభుత్వం బీసీ కులస్తులకు అందించే రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీ టవర్‌ను నిర్మించామన్నారు. వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి న్యాక్ భవనాన్ని ఏర్పాటు చేశామన్నారు. వచ్చే తరాలకు సైతం తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ పైపులైన్లు నిర్మించామన్నారు. ఎల్లమ్మగుట్ట రైల్వే కమాన్ వద్ద ఆర్‌యూబీ, అత్యాధునిక సౌకర్యాలతో వైకుంఠధామాలు నిర్మించామన్నారు. హైదరాబాద్‌లోని మహా ప్రస్థానం కన్నా నిజామాబాద్ వైకుంఠధామాలు బాగున్నాయని మంత్రి కేటీఆర్ కితాబునిచ్చారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆలయాలు పూర్వవైభవం సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, సిర్ప రాజు, సామ హన్మంతు రావు, కొత్తూర్ చంద్రకాంత్, మంతెన దశరథ్, ఎన్ను సుదర్శన్ పాల్గొన్నారు.

**ఐకమత్యానికి నిదర్శనం పద్మశాలీలు..**

ఐకమత్యానికి నిదర్శనం పద్మశాలీలని ఎమ్మెల్యే గణేశ్ గుప్తా అన్నారు. నగరంలోని 15 తర్పల సభ్యులతో గాయత్రీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నేతన్నల ఆత్మహత్యలతో ఆగిన మగ్గాలు.. నేడు సీఎం కేసీఆర్ భరోసాతో పరుగులు పెడుతున్నాయన్నారు. బతుకమ్మచీరల తయారీతో చేనేత కార్మికుల జీవితాల్లో ఉపాధి వెలుగులు నిండాయన్నారు. నేతన్నలను ఆదుకునేందుకు పింఛన్లు సైతం ఇస్తున్నట్లు తెలిపారు. నగరంలోని పద్మశాలీల సంఘ భవనాల కోసం రూ.8 కోట్లు కేటాయించామన్నారు. రాజకీయాలతో పాటు వివిధ కమిటీల్లో పద్మశాలీలకు ప్రాధాన్యం కల్పించామని వివరించారు. రూ. కోటీ 50 లక్షలతో పద్మశాలీ కల్యాణ మండపాన్ని , రూ. 5 లక్షలతో ఉద్యోగుల సంక్షేమ భవనాన్ని నిర్మించామన్నారు. నగరంలో ప్రతి కులసంఘానికి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని వివరించారు. పద్మశాలీ హాస్టల్ నిర్మాణానికి రూ. కోటి నిధులు మంజూరు చేశామన్నారు. పద్మశాలీల ఆరాధ్య దైవం భక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణం కోసం రూ. 25 లక్షల నిధులు మంజూరు చేశామని తెలిపారు. మరింత అభివృద్ధి కోసం మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి చేస్తానన్నారు.

కార్యక్రమంలో గుజ్జేటి వెంకటనర్సయ్య, ఎనగందుల మురళి, సిరిగాద ధర్మపురి, సత్యపాల్, పుల్గం హన్మాండ్లు, దీకొండ యాదగిరి, బిల్ల మహేశ్, చింత మహేశ్, రాపెల్లి గురుచరణం, కస్తూరి గంగరాజు, శివలింగం, బింగి మోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పద్మశాలీలు

# బీఆర్‌ఎస్ గెలిస్తేనే తెలంగాణ సుభిక్షం


జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పెర్కిట్ బ్యాంగిల్స్ వెండర్ అసోసియేషన్ సభ్యులు

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే..మన గొయ్యి మనం తీసుకున్నట్లే
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

ఆర్మూర్, అక్టోబర్ 13 : కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే మన గొయ్యి మనం తీసుకున్నట్లేనని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసానికి ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామానికి చెందిన కురుమ సంఘం సభ్యులు, ఆర్మూర్ పట్టణ పరిధిలోని పెర్కిట్ బ్యాంగిల్ వెండర్ అసోసియేషన్ సభ్యులు భారీగా చేరుకొని బీఆర్‌ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ శుక్రవారం జీవన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఆర్మూర్ అభివృద్ధికి రాత్రింబవళ్లు కష్టపడుతున్నానని, ఆర్మూర్ ప్రగతి కోసం లెక్కలేనన్ని నిధులు సాధించానన్నారు. ప్రకృతి వనాలు, పరిశుభ్రత, క్రీడాప్రాంగణాలతో పల్లెలు కళకళలాడుతున్నాయని, 450 పథకాలతో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగునింపుతున్న నిజమైన ప్రజా ప్రభుత్వమని జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాయ మాటలు నమ్మవద్దని, ఆ రెండు పార్టీలు అభివృద్ధికి వ్యతిరేకమన్నారు. బీఆర్‌ఎస్ గెలిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంతో తనది అభివృద్ధి , సంక్షేమ బంధమన్నారు. తనను మూడో సారి గెలిపించాలని, ఆర్మూర్ అభివృద్ధి రథాన్ని మరింత పరుగులు పెట్టిస్తానని జీవన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అంకాపూర్ సర్పంచ్ కిశోర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు, సీనియర్ నా యకులు పండిత్ పవన్, ఖాందేశ్ శ్రీనివాస్, సంజయ్ సింగ్ బబ్లూ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం


మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 13 : రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లోని రూమ్ నెం. 28లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పని తీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థుల రాజకీయ పార్టీల ప్రకటనలకు సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ ఛానళ్లలో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలన్నారు. వార్తా పత్రికలు, ఈ–పేపర్లు, టెలివిజన్ ఛానళ్లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో, వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని కలెక్టర్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా పూర్తి సహకారమందించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ వేణు ప్రసన్న, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల పర్యవేక్షకులు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సమష్టిగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

- కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్
- నోడల్ అధికారులతో సమావేశం

కామారెడ్డి,అక్టోబర్ 13 : ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమష్టి కృషి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో నోడల్ అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి మాట్లాడుతూ.. ఎన్నికల విధులకు సంబంధించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ మద్యం, డబ్బు, సరుకుల పంపిణీ, రవాణా జరిగినప్పుడు ప్రజలు సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి డబ్బును తరలిస్తే స్వాధీనపరుచుకుంటామన్నారు. రూ.10 లక్షలకు మించి డబ్బు కలిగి ఉంటే ఆదాయపన్ను శాఖ అధికారులకు అందజేస్తామన్నారు. నియోజకవర్గానికి మూడు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని, వారు ఎక్కడ ఫిర్యాదు అందినా తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారని అన్నారు. పోలీసు,అబ్కారీ శాఖలు చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. సువిధ యాప్ ద్వారా ముందస్తుగా అనుమతులు తీసుకొని సభలు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, వీటంతటిని వీడియో తీస్తారన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా పని చేయాలని, ఏ చిన్నతప్పు జరిగినా ఎవరినీ వదిలిపెట్టవద్దన్నారు.